# వాళ్ళనలా వదిలేద్దాం

శ్రీ నేమాని సంగమేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

"ఏమమ్మా! ఒంట్లో అదోలావున్నట్లు కనిపిస్తున్నావ్!" తల్లిలాలనగా అడిగింది.

మౌనంగా వూరుకుంది.

"కళ్లు ఎఱ్ఱగావున్నాయేవమ్మా! రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదూ?"

నిజమే తనకు రాత్రి అసలే నిద్రపట్టలేదు. $3\frac{1}{2}$ గంటలవరకు పిచ్చి ఆలోచనలతో మధనపడసాగింది. ఆ తరువాత కొంచెం నిద్రపట్టింది. అయినా అది దాచడానికి ప్రయత్నిస్తూ "అబ్బే! రాత్రిబాగానే నిద్రపట్టిందమ్మా!......ఇప్పుడు సోపుతో ముఖం కడుకున్నాను కదూ ... నురుగు కొంచెం కళ్లలో పడ్డాది...అందుకు....!" ఇది అబద్ధం అని పైకి తెలిసిపోతున్నాది.

తల్లి ప్రేమతో తన శరీరంచుట్టూ చేతులు వేసి ఒకమారునిమిరి "పిచ్చిపిల్ల" అని అనుకోవడం విన్నాది దమయంతి.

"అమ్మాయ్! నిన్న మన యింటికి ప్రభాకరు వచ్చేడట – నాకు చెప్పేవేకాదేమిటమ్మా"? అంది తల్లి.

"అతను ఎవరో నాకు తెలియదమ్మా! అన్నయ్య హడావిడిగా మేడమీద నాగదిలోకివచ్చి అతని దగ్గర నన్ను పాడమని బలవంతచేసేడు – అతను నా పాటను చాల మెచ్చుకున్నాడమ్మా!" అంది దమయంతి వుత్సాహంగా.

"చాల మంచివాడమ్మా! వాళ్ల కుటుంబము అంతా మంచిదే!" అంది తల్లి గుట్టు తెలుసుకుందుకు "మంచివాడులాగే కనపడుతున్నాడమ్మా" అంది దమయంతి మెరుస్తున్నకళ్ళతో. దమయంతి లేచింది.

లేస్తున్న కూతురుని చూసి 'అమ్మాయ్' అంది తల్లి.

ఆగింది దమయంతి.

తనలో ఏమాలోచించుకుందో "ఏమీ లేదమ్మా! నువ్వువెళ్లు" అని వంటింటిలోకి నడిచింది తల్లి.

దమయంతి మేడమీద తన గదిలోకి బయలు దేరింది. "ఎందుకు తల్లి తెచ్చింది ప్రభాకరుని ప్రస్తావన" అని తలపోస్తూ మెట్లు ఒక్కొక్కటే ఎక్కుతున్నాది. తన బలహీనత వల్ల కాబోలు మెట్లు ఎత్తు ఎక్కువ పెరిగినట్లు కనిపించేయ్ దమయంతికి. భారంగా నడుస్తూ తనగది చేరుకుంది.

టేబిలు దగ్గర కుర్చీలో కూర్చుంది. అక్కడేవున్న లెటర్ పేడ్, ...పౌంటెన్ పెన్ను తీసింది. "ప్ర భా క ర ం ......ప్రేమ ...... దమ యంతి ... స్వభావం ...... దిగులు .... .... విరహం ...... దమయంతి ...... ప్రభాకరం..." యిలాగ ఏమిటో పిచ్చి రాతలు, వంకర టింకర గీతలు గీసింది.

కాగితం "పేడ్" నుంచి చింపింది. తీసి చదివింది. ... నవ్వొచ్చింది పిచ్చిరాతలకి. ఆకాగితాన్ని ముక్కలకింద చించేసి నలిపి కిటికీలోంచి పారేసింది.

లేచింది అన్నయ్యగదిలోకి వెళ్లింది. అన్నయ్యలేడు. ఎనిమిదిగంటలకే ఎక్కడికో వెళ్లిపోయేడు. "షెల్ఫు"లో ఉన్న కొన్ని పుస్తకాలు తీసి చూసింది. మళ్లా వాటిని యథాస్థానములో వుంచేసింది.

మంచము మీద కొంత చిల్లర కొన్ని యిచ్చు రూపాయిలు కనిపించేయ్ ! రాత్రి అన్నయ్య బట్టలు మార్చుకోకుండా పడుకున్నాడు కాబోలు ! అవి జేబులోంచి పడిపోయి వుంటాయ్. అంతా చేర్చి టేబిలు మీద దొంతి పెట్టింది. బయటకు వస్తూవుంటే ద్వారమందానికి చెయ్యి తగిలి ఒక గాజుపగిలింది ! చిన్న సంకోచపూర్వకమయిన వ్యథను పొందింది దమయంతి !

కూర్చొని విరిగిపోయిన ముక్కలన్నీ ఏరింది. ఒక సెకండు ఆలోచించి ఆముక్కలను కిటికీలోంచి బయటకు పారేసింది.

ఏదో బాధ? ఏంబాధ యిది? తనకేమీ అర్థమవడం లేదు. ఇవాళ ఏదయినా సినీమాకు వెళితే బాగుంటుంది! "మేటనీకి" వెళితే 6½గంటలకు తిరిగి రావచ్చు.

ప్రభాకరం కూడా తనతో వస్తే బాగుంటుంది అని అనిపించింది. ఏమో! తనకి తెలియకుండానే రాకూడదా ? ఆ! ఎందుకువస్తాడు ? ఎందుకురాకూడదూ ? ఎందుకోఎప్పుడూలేంది తనమనసు యివాళ పురుషుని వాంఛిస్తున్నాదేమో ? దీనికి కారణ మేమిటో !

అన్నయ్య వూరుకున్నవాడు వూరుకోకుండా తనని ప్రభాకరానికి పరిచయంచేసి ప్రభాకరం ఎదుట తనని ఎందుకు పాడమనాలి ? అతను తన పాటనువిని మెచ్చుకోవడం ఎందుకు ? భోజనాల దగ్గర నాన్నగారుకూడా అన్నారు"ప్రభాకరం మంచివాడు" అని. మంచివాడు కాకపోతే ఎందుకంటారు. తన మనస్సు ప్రభాకరాన్ని కోరుతున్నాది అని ఇవాళ గ్రహించగలిగింది దమయంతి !

ఇందాక అమ్మకూడా అంది మంచివాడని. మంచివాడు అంటే అర్థంఏమిటి ఏమిమంచి వుంది అతనిలో ?

తనగదిలో ప్రవేశించి ఆరోజు దిన

పత్రిక తిరగవెయ్య నారంభించింది దమయంతి. మొదట పేజీలోనే "సూళ్లూరుపేటలో ఒకయువతి ఆత్మహత్య" అనివున్న హెడ్డింగు చూడగానే ఆతృతతో చదువ సాగింది.

"సూళ్లూరుపేటలో తన తల్లిదండ్రులు తనుప్రేమించిన యువకునితో వివాహము చేయకుండా ఇంకొక ముసలివానితో సంబంధము చేస్తున్నారని రాజమ్మ అనే తమిళయువతి (వయస్సు 18 సం) నిన్న సాయంత్రము నూతిలోపడి ఆత్మహత్య చేసుకుంది......."

"పాపం! ఆదీనురాలి ఆత్మశాంతికై ఒక్క అశ్రుకణం దమయంతి రాల్చగలిగింది! అంతకన్న యేంచెయ్యగలదు! తెలివి తక్కువది కాకపోతే ఆత్మహత్య చేసుకోవడం ఎందుకు? చచ్చి ఎవరిని సాధించగలదు? అయినా తల్లిదండ్రులకు బుద్ధి వుండక్కరలేదూ? ఆప్రేమించిన వానితో కాక ఒకముసలివానితో వివాహంచేయబోతారా? మూర్ఖులు! అనవసరంగా కూతుర్ని చంపేసుకున్నారు!

ఏమిటో ఈ జీవితాలు! వీటి సమస్యలు! వాటి పరిసమాప్తులు !......విచారించేవారు కొందరు! ఆనందించేవారు కొందరు! అనుభవించేది కొందరు! అనుభవింపజేసేవారు కొందరు !......కొందరు.......కొందరు ......కొందరు......

ఏమో! మనం ఊహించినట్టు ఏదీ జరుగదు! .. ...." ఇలా ఆలోచిస్తూ షెల్ఫుదగ్గరకు నడిచి పుస్తకాలుసర్దుకొంది దమయంతి. ఇవాళ మళ్లా కాలేజీకి బయలుదేరింది!

ఈ మధ్య చదువుమీద ఉత్సాహం తగ్గడం వల్ల వారం, పదిరోజులయింది కాలేజీకి వెళ్లడం మానేసింది......

5

కాలప్రవాహంలో కొన్ని రోజులు, మాసములు గతించేయి. ఇలాంటి మానసిక వ్యధలతో, సమస్యలతో దమయంతి బ్రతుకును దిగుల్తో వెళ్ళబుచ్చుతున్నాది!

ఒకనాటి సాయంత్రము ఎప్పుడూ తన గదికిరాని తండ్రి ఆ నాడు తన గదికి రావడం దమయంతిని ఆశ్చర్యపరచింది!

"ఏంనాన్నా! ఇలా వచ్చేవ్! రా! కూర్చో." అంటూ యీజీఛైరు ముందుకి లాగింది.

కూర్చుంటూ "ఒక్క నిముషమే అమ్మాయ్" అన్నాడు తండ్రి.

తను నిశ్శబ్దముగా కిటికీ వూచలలోంచి దూరంగావున్న కొబ్బరిచెట్లు చూస్తున్నాది.

"అమ్మాయ్ నువ్వు! యింక చదువు, సంధ్య ఆపివేయి తల్లీ! నీకు యిష్టం

ప్రేమ, ఉంది అని గ్రహించే ప్రభాకరునితో నీ వివాహం నిశ్చయించేను అమ్మా!'' అన్నాడు.

తను మౌనంగా నిలబడి వింటున్నాది.

''అమ్మా! నీ సౌఖ్యమే మా సౌఖ్యం అంతకంటే మేము కోరేది ఏదీ వుండదు! ఇష్టపడ్డానని చెపుతేగాని నా మనస్సుకు సంతృప్తిగా వుండదమ్మా'' ... అన్నాడు వృద్ధుడు ప్రేమ, కరుణ, ఉట్టిపడుతున్నట్టుగా.

తనకు యిటువంటి తండ్రిని ప్రసాదించినందుకు ఆ భగవంతుడికి నమస్కరించింది తనలో.

''నీ యిష్టమే నా యిష్టం నాన్నా!'' అని మాత్రం బయటకు అనగలిగింది వంగి తండ్రి పాదాలకు నమస్కరిస్తూ.

''హాయిగా కలకాలం బిడ్డలతో సుమంగళిగా జీవించు తల్లీ'' అని ఆ వృద్ధుడు దీవించి తన కంటివెంట వస్తున్న ఆనంద బాష్పాలను తుడుచుకుంటున్నాడు. ఎందుకో అతని శరీరం వణకుతున్నాది. మెల్లిగా దిగి కిందికి వెళ్ళేడు!

మర్నాడు సాయంకాలం కొన్ని ఇన్విటేషను కార్డులు సీతచేత దమయంతికి పంపేడు తండ్రి, స్నేహితురాండ్రకు పంపమని.

కార్డులు చూసింది! అందంగానే వున్నాయి! మీదను తన పేరు, క్రింద ప్రభాకరరావు పేరు వుండి, మధ్యను "with" అని వుండడం గుర్తించింది.

ఇప్పుడు ఈ "with" కి ప్రపంచములో దేనికీలేని బరువూ, విలువావచ్చినట్లున్నాయ్!

పెళ్లి నిశ్చయించేరు కాబట్టే ఆరోజున అమ్మ ప్రభాకరుని ప్రస్తావన యెత్తింది అన్నమాట!

తనకి ఏదోదిగులు పట్టుకుంది అని అనుకుంది.

ఈ పెళ్లి తనకిష్టంలేనట్టు భావించింది!

తనకి అసలు పెళ్లి చేసుకోవాలనే లేదేమో! అయితే ఈ పెళ్లికి ప్రతిఘటిస్తే! తన పిచ్చిగాని ప్రతిఘటన ఎందుకు?

మళ్ళీతనలోతాను ఈ పెళ్లికి ఆమోదం చూపింది! తన యిష్టంమీదే తల్లిదండ్రులు ఈ పెళ్లి చేస్తున్నారు.

నిజంగా తను యిష్టపడ్డదా? ఏమో? తన మనస్సు ఎప్పుడయితే ప్రభాకరాన్ని వాంఛించిందో అప్పుడే యిష్టపడ్డదన్న మాట!

ప్రభాకరాన్ని వారం రోజుల క్రిందటే చూడడం! అనాటినుండీ మరి అతను రాలేదు! ఎందుకురాలేదు? ఏమో? తన గురించి అయినా వస్తాడనుకుంది! కాని అతనురాలేదు—!

తనకిప్రభాకరం కావాలని తను తెలుసుకోగలిగింది. కాని ప్రభాకరానికి తను కావాలో? వద్దో! ఏం! తనకంటె అందకత్తె, విద్యావతి, సుగుణవతి దొరకుతుందా? తను నిజంగా అందంగాలేదూ?

(సశేషము)